# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 12-10-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని.లు

## ముఖ్యాంశాలు

- ఢిల్లీలోని లాల్ ఖిలా మైదాన్‌లో ధార్మిక్ లీలా కమిటీ ఆధ్వర్యంలో ఈ రోజు నిర్వహించిన రావణ దహన కార్యక్రమంలో రాష్ట్రపతి, ప్రధానమంత్రి పాల్గొన్నారు.
- దేశ సరిహద్దు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి ప్రాజెక్ట్ లను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు జాతికి అంకితం చేశారు.
- ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలలోని గ్రామీణ స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం నిధులను ఈరోజు విడుదల చేసింది.
- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2021లో ప్రారంభించిన పీఎం గతిశక్తి జాతీయ బృహత్ ప్రణాళిక ఈరోజుతో 3 సంవత్సరాలు పూర్తిచేసుకుంది.

==========================

దేశవ్యాప్తంగా విజయదశమి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారు. దసరా పండుగ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమాల వేదికగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఢిల్లీలోని లాల్ ఖిలా మైదాన్‌లో ధార్మిక్ లీలా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రామ్ లీల కార్యక్రమంలో రాష్ట్రపతి, ప్రధానమంత్రి పాల్గొన్నారు.

==========================

దేశ సరిహద్దు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి 2 వేల 236 కోట్ల రూపాయలతో బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ -BRO నిర్మించిన 75 ప్రాజెక్ట్ లను రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈరోజు న్యూ ఢిల్లీ నుంచి దృశ్యమాధ్యమ విధానం ద్వారా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఈ ప్రాజెక్టులను అండమాన్ & నికోబార్ దీవులతో సహా 11 సరిహద్దు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో నిర్మించారు. దేశ రక్షణలో భాగంగా ఈశాన్య, సరిహద్దు రాష్ట్రాల ప్రాముఖ్యత

దృష్ట్యా, అవసరమైన నిధులను కేటాయించి అభివృద్ధిని వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటున్నామని రక్షణ మంత్రి తెలుపుతూ....

(వాయిస్ 35 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలలోని గ్రామీణ స్థానిక సంస్థలకు నిధులను కేంద్ర ప్రభుత్వం ఈరోజు విడుదల చేసింది. దీనిపై మరిన్ని వివరాలను మా ఆకాశవాణి ప్రతినిధి అందిస్తారు.

(వాయిస్ 36 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2021లో ప్రారంభించిన పీఎం గతిశక్తి జాతీయ బృహత్ ప్రణాళిక ఈరోజుతో 3 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా, కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ... దేశంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల రూపకల్పన, అమలులో ప్రధానమంత్రి గతిశక్తి యోజన మార్పును తీసుకువచ్చిందని, తద్వారా మరింత సమర్థవంతమైన, పారదర్శకమైన పాలన వ్యవస్థను రూపొందించామని తెలిపారు. దేశంలోని గ్రామాలకు ప్రభుత్వ సేవలను అందించామని మంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత్‌లో మాట్లాడే ప్రతి భాషా జాతీయ భాషే అని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సర్ సంఘ చాలక్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. మహారాష్ట్రలోని నాగపూర్‌లో ఈ రోజు విజయదశమిని పురస్కరించుకొని ఆర్ఎస్ఎస్ 99వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాజ్యాంగంలోని నిర్దేశక సూత్రాలు, ప్రాథమిక విధులు, హక్కులకు సంబంధించిన సమాచారం సామాన్య ప్రజలకు చేరాలన్నారు. విద్యార్థి దశ నుంచే సాంస్కృతిక విలువలను పెంపొందించాల్సిన అవసరం ఉందని అన్నారు. భాషలు వేరు అయినా.. భారతీయుడిగా అందరి ఆలోచన ఒకేవిధంగా ఉంటుందని మోహన్ భగవత్ పేర్కొన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ 99 ఏళ్ళు పూర్తి చేసుకొని 100వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ సామాజిక మాధ్యమం వేదికగా శుభాకాంక్షలు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఇండో - పసిఫిక్ ప్రాంతంలో సముద్ర భద్రతా సహకారాన్ని విస్తరించే క్రమంలో విశాఖపట్నం సముద్ర తీరంలో తూర్పు నావికా దళం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మలబార్ - 2024 అంతర్జాతీయ నావికా విన్యాసాలు కొనసాగుతున్నాయి. దీనిపై మా ఆకాశవాణి విశాఖపట్నం ప్రతినిధి వి.సత్యనారాయణ మూర్తి మరిన్ని వివరాలను అందజేస్తారు.

(వాయిస్ 43 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

స్విజ్జర్లాండ్ లోని జెనీవాలో రేపటి నుండి ఈ నెల 17వ తేదీ వరకు జరగనున్న ఇంటర్ పార్లమెంటరీ యూనియన్-ఐపియు సమావేశాల్లో లోక్‌సభ స్పీకర్ పాల్గొనున్నారు. ఐపీయూ 149వ పాలక మండలి సమావేశాల్లో పాల్గొనే పార్లమెంటరీ ప్రతినిధి బృందానికి ఓం బిర్లా నాయకత్వం వహించనున్నారు. "మరింత శాంతియుతమైన

స్థిరమైన భవిష్యత్తు కోసం శాస్త్ర, సాంకేతిక, ఆవిష్కరణలను ఉపయోగించడం" అనే అంశంపై ఓం బిర్లా ప్రసంగిస్తారు. అలాగే ఈ నెల 14న జెనీవాలో ప్రవాస భారతీయులతో ఆయన సమావేశం కానున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

హర్యాణా రాష్ట్ర నూతన ముఖ్యమంత్రిగా ఈ నెల 17వ తేదీన నయాబ్ సింగ్ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. పంచకులలోని దసరా మైదానంలో ఉదయం 10 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనుంది. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, భారతీయ జనతా పార్టీ సీనియర్ నేతలు, ఎన్డీయే పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు హాజరుకానున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో 90 మంది సభ్యుల హరియాణా అసెంబ్లీలో 48 మంది శాసనసభ్యులతో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం కోసం నిర్దేశించిన pminternship.mca.gov.in ఆన్‌లైన్ పోర్టల్‌లో ఈరోజు సాయంత్రం నుంచి నమోదు ప్రక్రియ ప్రారంభమైందని అధికారులు తెలిపారు. ఈ పోర్టల్‌లో ఇప్పటివరకు 193 కంపెనీలు దాదాపు 91 వేల ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించనున్నాయి. 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో 21 నుంచి 24 సంవత్సరాల లోపు 1.25 లక్షల అభ్యర్థులకు 12 నెలల ఇంటర్న్ షిప్‌లను అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం ద్వారా ఇంటర్న్ షిప్ కు ఎంపికైన అభ్యర్థులకు ప్రతి నెలా 5 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందించనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని ప్రఖ్యాత బద్రీనాథ్ ఆలయాన్ని శీతాకాలం దృష్ట్యా వచ్చే నెల 17వ తేదీ నుంచి మూసివేయనున్నట్లు ఆలయ కమిటీ ఈ రోజు ఒక ప్రకటనలో తెలిపింది. ఆలయ సంప్రదాయం ప్రకారం విజయదశమి పర్వదినం నాడు ఆలయ మూసివేత తేదీ సమయానికి సంబంధించిన మూహూర్తాన్ని నిర్ణయిస్తుంటామని బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ చైర్మన్ అజేంద్ర అజయ్ తెలిపారు. ఈ సంవత్సరం 11 లక్షల మందికి పైగా భక్తులు బద్రీనాథ్‌ను సందర్శించగా, కేథార్ నాథ్‌ను 13.5 లక్షల భక్తులు సందర్శించారని ఆయన తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ బాల, బాలిక అత్యవసర నిధి - యూనిసెఫ్ సంస్థకు భారత్ 3వ అతిపెద్ద సరఫరాదారుగా ఉందని ఆ సంస్థ ప్రతినిధులు ఈరోజు వెల్లడించారు. UNICEF సరఫరా విభాగం డైరెక్టర్, లైలా పక్కాలా మాట్లాడుతూ... భారత్ అందిస్తున్న సహాయం దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అనేక దేశాలలోని చిన్నారుల జీవితాలను రక్షించేందుకు భారత్ సరఫరాదరులు అందించే సహాయం విలువైనదని తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన యువత మధ్య సంబంధాలను బలోపేతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ లో భాగంగా "యువ సంగం" 5వ దశ కార్యక్రమ నమోదు ప్రక్రియకు ప్రత్యేక వెబ్ పోర్టల్ ను ప్రారంభించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =